సాక్షి కరీంనగర్

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



అమర జవాన్లకు నివాళి

మానకొండూర్: జమ్మూలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్లకు మానకొండూర్ ఎన్‌జీపీఎస్‌వో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.



కుల సంఘం భవనానికి ప్రొసీడింగ్స్

వడ్డెర కుల సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి మంత్రి గంగుల కమలాకర్ శుక్రవారం ప్రొసీడింగ్స్‌ను ఆ సంఘం నాయకులకు అందించారు.

IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
37.0/26.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మొదలైన నేషనల్ హైవే పనులు



భూమి చదును చేస్తున్న యంత్రాలు

మానకొండూర్: ముంజంపల్లి శివారులో నేషనల్ హైవే 563 రహదారి నిర్మాణ పనులు శుక్రవారం మొదలయ్యాయి. పంట పొలాల్లో మిషనరీలతో రహదారి నిర్మాణం కోసం భూమిని చదును చేపట్టారు. ముంజంపల్లి శివారులోని జాలగుట్ట నుంచి మానకొండూరు, శ్రీనివాస్‌నగర్, బొమ్మకల్ సమీపంలోని కరీంనగర్–రామగుండం రహదారి వరకు సుమారు పది కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

ఎంసీహెచ్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో



గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

కరీంనగర్‌టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలిత దేవి శుక్రవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మాతా శిశు కేంద్రాన్ని సందర్శించారు. మాతా శిశు కేంద్రంలో గర్భిణులతో మాట్లాడి ఎంసీహెచ్‌లో అందుతున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణుల సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

1 నుంచి సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు

చిగురుమామిడి: సుందరగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కొబ్బరికాయల వేలం నిర్వహించారు. అంతకుముందు స్వామి వారి హుండీ లెక్కించారు. శుక్రవారం ఈవో ఆధ్వర్యంలో హుస్నాబాద్‌కు చెందిన గోమాత భజన మండలి సభ్యులు హుండీ లెక్కించారు. రూ.1,30,027 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి సత్యనారాయణ, పూజారులు శేషం శ్రీనివాసాచార్యులు, సముద్రాల శ్రీనివాసాచార్యులు, నర్సింహాచార్యులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు నాంపల్లి కొంరయ్య, వంతడుపుల దిలీప్‌కుమార్, పెసరి రాధాకృష్ణ, శ్రీరామోజు రాజ్‌కుమార్, ఎలగందుల అశోక్, ఆలయ క్లర్క్ బూట్ల కవిత, ఎంపీటీసీ మేడబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. మామిడికి నష్టం



గంగిపల్లిలో నేలరాలిన మామిడికాయలు

గన్నేరువరం/మానకొండూర్/చొప్పదండి: అకాల వర్షాలు రైతులకు మరోసారి నష్టం తెచ్చిపెట్టాయి. గన్నేరువరం మండలంలోని మాదాపూర్, జంగపల్లి, ఖాసీంపేట గ్రామాల్లో మామిడితోటలకు నష్టం వాటిల్లింది. మామిడికాయలు నేలరాలాయి. అలాగే.. వివిధ గ్రామాల్లో వరి పంట నేలవాలింది. మొక్కజొన్న పంటకు సైతం నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్, అన్నారం, గంగిపల్లి, వేగురుపల్లి, ఊటూరు, ఈదుల గట్టెపల్లి, ముంజంపల్లిలో మామిడికాయలు నేలరాలాయి. చొప్పదండి మండలంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ ఈదురు గాలులు వీచి కోతకు వచ్చిన మామిడి కాయలు రాలాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

డబుల్ బెడ్ రూముల హామీ ఏమైంది..?

- ఇక్కడి పచ్చదనానికి కారణం ఎస్సారెస్పీ కాలువలే..
- ఇసుక మాఫియాతో రోడ్లు ధ్వంసమైనా పట్టదా?
- పోలీసులు ఇసుక మాఫియా కోసం పని చేస్తున్నారు
- ప్రజా సమస్యలపై ధర్నాలు చేస్తే అరెస్టులా..?
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూముల హామీ ఏమైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం పీపుల్స్ మార్చ్‌లో భాగంగా ఆయన జమ్మికుంట మండలంలోని నాగంపేట నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తాను నియోజకవర్గంలో ప్రవేశించిన సమయంలో మహిళలంతా తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వస్తాయని ఆశించామని.. అవే మీ సాకారం కాలేదని వాపోయారన్నారు. తమ తరపున ఆ డిమాండ్లు పరిష్కారానికి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చేలా పోరాడాలని ప్రజలు కోరారని ఆయన తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 90 వేల ఎకరాల సాగుభూమి కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ కాలువల కిందే సాగవుతోందని.. కాళేశ్వరం లేదా మరే ఇతర ప్రాజెక్టు కింద ఇక్కడ అదనంగా ఒక్క ఎకరం కూడా సాగు కాలేదని పేర్కొన్నారు. కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు అవకాశమిస్తే.. 10 ఏళ్లు దాటినా 90 వేల ఎకరాలకు మించి ఎకరానికి కూడా అదనంగా నీళ్లివ్వలేదని విమర్శించారు.

ఇసుక మాఫియాతో ఇక్కట్లు

స్థానికంగా మానేరు నది మీద ఇసుక మాఫియా చెలరేగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామర్థ్యానికి మించిన లారీలు జమ్మికుంట, హన్మకొండ మార్గంలో రోడ్లను ధ్వంసం చేస్తున్నా



మంగహారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

యని వాపోయారు. రోడ్డు పక్కన జనావాసాలు లారీలతో వచ్చే దుమ్ముతో తీవ్ర అవస్థలు పడుతున్నారని, వారి పరిస్థితిని బాధితులు స్వయంగా ఇళ్లలోకి పిలిచి చూపించారని అన్నారు. ఇసుక లారీలకు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తే.. పోలీసులు అరెస్టు చేయడమేంటని విస్మయం వ్యక్తం చేశారు. ఇలాంటి కష్టాలు రావడం తెలంగాణ దౌర్భాగ్యమన్నారు. తాము అధికారంలోకి వస్తే పోలీసులను కేవలం పరిపాలన కోసం తప్ప పక్షపాతానికి వినియోగించమని స్పష్టం చేశారు.

ఇంటికి రాలేదంటూ కాంగ్రెస్ నాయకుని ఆవేదన

30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్న, ఎన్ని పార్టీల వాళ్లు ప్రలోభాలు పెట్టినా ఒక్క పైసా ఎవరి దగ్గర తీసుకోలేదని గంగ్రపల్లి గ్రామానికి చెందిన మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు పరశురాం ఆవేదన వ్యక్తం చేశాడు. నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారి ఇంటికి వెళ్లడమేంటని ప్రశ్నించారు. ఈ బాధ తాను భరించలేనని, పురుగుల మందు తాగుతానని.. పార్టీకి రాజీనామా చేస్తానని కన్నీరు పెట్టుకున్నాడు. దీంతో బల్మూరి వెంకట్, నాయకులు ఇంటికి వచ్చి బుజ్జగించారు.

పలకరిస్తూ.. ముందుకు సాగుతూ..

జమ్మికుంట మండలంలోని గుంపుల క్రాస్ రోడ్డు నుంచి భట్టి పీపుల్‌మార్చ్ పాదయాత్ర ప్రజలతో మమేకమై ముందుకు సాగింది. తనుగుల, గంగ్రపల్లి గ్రామాల వద్ద మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. నాగంపేట గ్రామం దాటిన తర్వాత భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం పాతయాత్ర కొనసాగిస్తూ శాయంపేట, ధర్మారం, కొత్తపల్లికి చేరుకున్నారు. కొత్తపల్లిలో ముస్లింల ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. అనంతరం మడిపల్లి గ్రామ సమీపంలోని శాంతినగర్ కాలనీ వద్ద బస చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, సదానందం, పరుశరాం, నియోజవర్గ మైనార్టీ చైర్మన్ ఎండీ సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

మానకొండూరులో తుపాకీ పేలలేదా?

- నిందితుల చేతులపై జీఎస్ఆర్ లేదంటున్న పోలీసులు
- అంతా పబ్లిసిటీ స్టంట్ అని కొట్టిపారేసిన ఖాకీలు
- ఇంకా ఆచూకీ చిక్కని నిందితుడు సాయితేజ



నిందితుడు సాయి (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మానకొండూరు కాల్పుల కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో అసలు కాల్పులు జరిగాయా? లేదా అన్న విషయంలో మొదటి నుంచి అనుమానాస్పదంగానే ఉంది. ఘటనాస్థలంలో బుల్లెట్ దొరకడం, బాధితుడు తనపై రెండుసార్లు ఫైర్ చేశారని మీడియా ముందు చెప్పడంతో కాల్పులు జరిగాయని అంతా అనుకున్నారు. దీంతో ఈ విషయాన్ని పోలీసులు శాస్త్రీయంగా నిర్ధారించుకున్నారని సమాచారం. సాధారణంగా తుపాకీ పేల్చిన తరువాత కొన్ని గంటలపాటు అలాగే ఉంటుంది. ఈ నేపథ్యంలో తుపాకీ ఎవరు పట్టుకున్నారు అన్న విషయంలో పోలీసులకు స్పష్టత ఉంది. కానీ, మీడియాలో తుపాకీ కాల్పులు అని నిందితుడు భాషబోయిన అరుణ్ పదేపదే చెబుతుండే సరికి, తమ కస్టడీలో ఉన్న ముగ్గురిని పరీక్షిస్తే.. వారి చేతులపై ఎలాంటి జీఎస్ఆర్ (గన్ షాట్ రెసిడ్యూ) ఆనవాళ్లు లభించలేదని ఓ ఉన్నతాధికారి స్పష్టంచేశారు. అదే విధంగా ఘటనాస్థలంలో కూడా కాల్పులు జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. గోడలకు తూటాల దెబ్బలు, నేలపైనా ఎలాంటి కెట్రిడ్జ్ (బుల్లెట్ కాల్చాక కిందపడే భాగం) అవశేషాలు లభించలేదని, కేవలం పేలని ఒక రౌండ్ బుల్లెట్ మాత్రమే లభించిందని వివరించారు.

➜ పాత నేరస్థుడైన అరుణ్ కేవలం తన పబ్లిసిటీ స్టంట్‌లో భాగంగానే.. సానుభూతి కలిగేలా ఉన్నవి, లేనివి కల్పించి చెబుతున్నాడని అభిప్రాయపడ్డారు. అతనికి గోదావరిఖని సాయితేజతో ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని కొట్టిపడేశారు. ఇద్దరు మూడేళ్ల క్రితం వరకు మంచి స్నేహితులు అని పేర్కొన్నారు. మ రోవైపు సాయితేజ కో సం హైదరాబాద్ వెళ్లిన ప్రత్యేక బృందానికి కొత్త విషయాలు తెలిశాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీటెక్ వరకు చదువుకున్న సాయితేజ కొంతకాలంగా గంజాయికి అలవాటుపడ్డాడని, అదే సమయంలో సోదరి ఆకస్మిక మరణం అతన్ని కుంగదీసిందని కుటుంబసభ్యులు తెలి పారు. అయితే.. పదే పదే గొడవల్లో ఇరుక్కుని కుటుంబానికి తలనొప్పిగా మారిన కారణంగా సాయితేజకు తామంతా చాలాకాలంగా దూరంగా ఉంటున్నామని వివరించారు. ఈ సమాధానాలతో పోలీసులు నిరాశచెందారు. నిందితుడు సాయి తన కుటుంబ సభ్యులను కచ్చితంగా సంప్రదించేందుకు వస్తే.. పట్టుకోవచ్చన్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది.

మిత్రుడి కారు.. ఫోన్ స్విచ్చాఫ్..

అరుణ్‌పై హత్యాయత్నానికి సాయితేజ గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన అతని స్నేహితుడు స్విఫ్ట్ డిజైర్ కారు తీసుకెళ్లాడని పోలీసులు గుర్తించారు. ఘటన అనంతరం మానకొండూరు నుంచి సాయి హైదరాబాద్ మార్గంలోనే పారిపోయాడని పోలీసుల వద్ద సమాచారం ఉంది. కానీ.. హత్యాయత్నం తరువాత సాయి అనూహ్యంగా సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. దీంతో అతన్ని పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. సాయికి గంజాయి వ్యాపారులతో సంబంధాలున్న నేపథ్యంలో అతను ఎక్కడ తలదాచుకున్నాడన్నది పోలీసులకు అంతుచిక్కడం లేదు. వీలైనంత త్వరగా పట్టుకుంటామని పోలీసులు మాత్రం ధీమాగా ఉన్నారు.

పడిపోతున్న పత్తి ధరలు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో పత్తి ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. గత సోమవారం నుంచి శుక్రవారం వరకు క్వింటాల్‌కు రూ.200 వరకు ధరలు తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. మార్కెట్‌కు 88 వాహనాలలో 1,430 క్వింటాళ్ల పత్తిని రైతులు తీసుకురాగా మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.7,200 కాగా గన్నీ సంచుల్లో వచ్చిన పత్తికి.. క్వింటాల్ గరిష్ట ధర రూ.7,200 ధర పలికింది. కాగా శనివారం రంజాన్ పండుగ, ఆదివారం సాధారణ సెలవులు ఉన్నాయని, సోమవారం మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ తెలిపారు.

జమ్మికుంట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయండి



కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన ఎంపీ సంజయ్

- కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ బండి సంజయ్ వినతి

కరీంనగర్‌టౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన సందర్భంగా వినతి పత్రం అందజేశారు. ఉత్తర తెలంగాణలో జమ్మికుంట రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాముఖ్యం ఉందని, గత పాలకుల నిర్లక్ష్యంతో తగిన నిధులు లేక అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి జమ్మికుంట రైల్వేస్టేషన్ అభివృద్ధి విషయంపై సంబంధిత అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే స్టేషన్లలో 100 రైల్వే స్టేషన్లను ఎంపిక చేసి ఆయా స్టేషన్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిన జాబితాలో కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు చోటు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అదే తీరు.. అదే తంతు..

- ప్రజాప్రతినిధుల గైర్హాజరు...
- ప్రభుత్వ ప్రధానాసుపత్రి నిర్వహణ తీరుపై అసహనం
- సూపరింటెండెంట్‌పై జడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

కరీంనగర్: ఎప్పటిలాగే జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు పేలవంగా సాగాయి. మెజార్టీ ప్రజాప్రతినిధుల గైర్హాజరు.. అధికారుల మొక్కుబడి సమాధానాల మధ్య శుక్రవారం జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మమ అనిపించారు. అధికారులు వారివారి శాఖల పనితీరుకు సంబంధించిన నివేదికలతో రావడం.. వాటిని చదవడం.. వెళ్లిపోవడం.. ఎప్పటిలాగే ఈ సారి అదే తంతు కొనసాగింది. ఉదయం 10.30 గంటలకు సమావేశాలు ప్రారంభం అయ్యాయి. జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, జడ్పీ సీఈవో ప్రియాంక, ట్రైనీ కలెక్టర్ లెనిన్, డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. 1 నుంచి 7 స్థాయీ సంఘాలైన ఆర్థిక–ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య–వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పనుల స్థాయీ సంఘ సమావేశాలపై సమీక్ష నిర్వహించారు.

14 నెలలు అవుతున్నా ఒక్క ఫైల్ లేదు..

‘ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో అసలేం జరుగుతోంది..? కనీసం సమాచారం ఇవ్వరు! ఏం జరుగుతోందో చెప్పరు. ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌ను అయిన నాకు తెలియకుండానే సెలవులో వెళ్లడం ఏమిటి..? 14 నెలలుగా ఒక్క ఫైల్ నా వద్దకు రాలేదు. పనులు ఎలా అవుతున్నాయి సమాధానం చెప్పండి’ అంటూ ఆసుపత్రి సూపరింటెండెంట్ రత్నమాలపై అసహనం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోండి అంటూ చురకలంటించారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ఆసుపత్రిపై నిర్లక్ష్యం వద్దు.. మరోసారి ఇలా చేస్తే సహించేది లేదంటూ సూచించారు. ఆసుపత్రిలో తక్షణమే మీటింగ్ ఏర్పాటు చేయాలంటూ జడ్పీ సీఈవో ప్రియాంక ఆదేశించారు. ఆర్టీసీ సమీక్ష సందర్భంగా హాజరైన డిప్యూటీ ఆర్ఎం భీంరెడ్డి ఆర్టీసీ ప్రగతి నివేదికను చదువుతుండగా జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకొని సమావేశాల ప్రాధాన్యతను గుర్తించి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో రావాలని సూచించారు. మరో సమావేశానికి ఆర్టీసీ ఈడీని హాజరయ్యేలా చూడాలన్నారు. హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ అర్పిత విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని.. జవాబుదారీతనం లోపించిందని.. తక్షణమే ఆమెను అక్కడి నుంచి బదిలీ చేయాలని డిప్యూటీ ఆర్ఎంకు సూచించారు. మైనింగ్ శాఖ సమీక్షలో జడ్పీకి రావాల్సిన రాయల్టీపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి కొరత రాకుండా చూడాలని, వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా అన్ని వసతులు ఏర్పాట్లు చేయాలని పలువురు జడ్పీటీసీలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జడ్పీటీసీలు గీకురు రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మాచర్ల సౌజన్య, పి.బక్కారెడ్డి, పుల్కం అనురాధ, పిట్టల కరుణ, కో ఆప్షన్ సభ్యుడు సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం 8,166 ఎకరాలేనట..

- 33 శాతం నిబంధనతో రూ.8.16 కోట్లు విడుదల
- గత నష్ట పరిహారం ఊసేదీ..?



కరీంనగర్ అర్బన్: పంట నష్టపరిహారం విడుదలైంది. గత నెలలో మూడు రోజులపాటు అకాల వర్షాలు అతలాకుతలం చేయగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం ఇస్తానని ప్రకటించిన విషయం విదితమే. ఈ క్రమంలో జిల్లాలో పంట నష్టం అంచనా వేయడంలో రెండు దశలకు గానూ ప్రాథమిక అంచనాలో 22 వేల ఎకరాల్లో నష్టం జరిగిందని ప్రకటించారు. తదుపరి తుది నివేదిక ప్రకారం కేవలం 8,166 ఎకరాలు మాత్రమే పంట నష్టం జరిగిందని నివేదించడం గమనార్హం. ఈ నేపథ్యంలో జిల్లాకు రూ.8.16 కోట్లు విడుదల కాగా శనివారం నుంచి బాధిత రైతుల ఖాతాకు చేరనున్నాయి.

గుదిబండలా 33 శాతం నిబంధన

అయితే.. అతివృష్టి లేదా అనావృష్టి అన్నదాతను అతలాకుతలం చేస్తోంది. ఎండనక వాననక కష్టపడిన కర్షకునికి అడుగడుగునా నిర్వేదమే. ఇక వాతావరణ ప్రతికూల పరిస్థితుల క్రమంలో ప్రభుత్వం నుంచి సాయం అందాల్సి ఉండగా సత్వర న్యాయం ఎండమావే. కాగా వ్యవసాయ శాఖ పంట నష్టం నివేదికను 33 శాతం నిబంధన నుసరించి రూపొందిస్తోంది. రైతువారీగా నష్టపోయిన పంట 33 శాతానికి పైగా ఉంటేనే పరిహారం వస్తుందన్నమాట. సదరు నిబంధన రైతులకు గుదిబండగా మారింది. ప్రాథమిక అంచనాలో 22 వేల ఎకరాలు నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ ప్రకటించగా తదనుగుణంగా పరిహారం వస్తుందని రైతులు భావించగా ఆశలు అడియాసలే అయ్యాయి.

గత పరిహారం ఏదీ

2021 ఆగస్టులో అకాల వాన పంటను తుడిచేయగా 24,803 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. కానీ.. ఇప్పటికీ పరిహారం విడుదల కాలేదు. ప్రాథమిక అంచనా వేసి తుది నివేదికను వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. పంటలో రైతు యూనిట్‌గా 33 శాతం నష్టం నిబంధన ప్రకారం 7,276 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నివేదించారు. సదరు పరిహారమైనా వచ్చిందా.. అంటే అదీ లేదు. ఇక అప్పటి నుంచి అకాల వర్షాలు, వడగళ్ల వానతో వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు నష్టం వాటిల్లుతుండగా వ్యవసాయ శాఖ అంచనా వేయలేదు. రైతుల వేదన అరణ్యరోదనగా మిగిలింది. రెండేళ్లలో సుమారు 50 వేల ఎకరాల్లో పంటనష్టం జరుగగా పత్రికల్లో కథనాలు మినహా ప్రభుత్వాల నుంచి సాంత్వన కరువైంది. కనీసం ప్రాథమిక అంచనా సైతం వేయలేదు. సదరు నష్టానికి నష్టపరిహారం ఉన్నట్టా లేనట్టా అన్నది అంతుబట్టడం లేదు.

గత నెలలో జరిగిన పంట నష్టానికి పరిహారం ఇలా..!

మొత్తం పంట నష్టం(ప్రాథమిక అంచనా)	22,000 ఎకరాలు
తుది నివేదిక ప్రకారం (33శాతం) నష్టం	8166.11 ఎకరాలు
విడుదలైన మొత్తం	రూ.8.16 కోట్లు
పరిహారం అందనున్న రైతుల సంఖ్య	9,445

తుది నివేదిక ప్రకారం పంటల వారీగా నష్టం

వరి	2,390 ఎకరాలు
మొక్కజొన్న	3,778
మామిడి	1,701
ఇతర పంటలు	297

2020-22 వరకు నష్టం గణాంకాల్లో..

- జిల్లాలో మొత్తం గ్రామాలు 313
- ఎక్కువ పంట నష్టం జరిగిన గ్రామాలు 168
- మొత్తం పంట నష్టం 44,803 ఎకరాలు
- నష్టం విలువ సుమారు రూ.100 కోట్లు
- నష్టపోయిన రైతుల సంఖ్య 24,000
- నష్టపోయిన పంటలు వరి, మొక్కజొన్న, కంది, పత్తి, పెసలు

‘పట్టా’భిషేకానికి ఇంకెన్నాళ్లు?

- సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అన్నదాతల నిరీక్షణ
- భూమి విక్రయించుకోలేక ఇబ్బందులు
- వేల ఎకరాలు ప్రభుత్వ పథకాలకు దూరం
- జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 87,084



నగరంలోని మీసేవలో దరఖాస్తు చేస్తున్న రైతులు (ఫైల్‌)



ఈ రైతు పేరు రాజిరెడ్డి. 2002లో తిమ్మాపూర్‌ మండల కేంద్రంలో సాదాబైనామా కాగితంపై రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. విక్రయించిన రైతు పదేళ్ల క్రితం చనిపోయారు. మోకాపై రాజిరెడ్డి పంటలు పండిస్తున్నప్పటికీ రికార్డుపరంగా విక్రయించిన రైతు పేరే కనిపిస్తోంది. 2016లో ప్రభుత్వం సాదాబైనామాలకు అవకాశం కల్పించగా దరఖాస్తు చేశాడు. కానీ ఇప్పటికీ రికార్డుపై ఆయన పేరు చేరలేదు. కరీంనగర్‌ జిల్లాలో ఇలాంటి వారు వేలల్లో ఉండగా ‘పట్టా’భిషేకం జరిగేనా.. ప్రభుత్వ ప్రయోజనాలు అందేనా అంటూ నిరీక్షిస్తున్నారు.

కరీంనగర్‌ అర్బన్‌: రైతుకాని రైతులుగా మిగిలిన వారి పేర్లు రికార్డులో నమోదు చేయాలని, సాదాబైనామా కాగితాలపై భూములు కొనుగోలు చేసిన అన్నదాతలకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు గతంలో అవకాశం కల్పించగా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం గుదిబండగా మారింది. 2014 జూన్‌ 2వ తేదీలోపు కాగితంపై భూములను కొనుగోలు చేసిన వారికి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని భావించినా ఏళ్లుగా నాన్చుతుండటం ఆందోళనకర పరిణామం.

18 వేల దరఖాస్తుల తిరస్కరణ

జిల్లాలో కరీంనగర్‌ అర్బన్‌తోపాటు తిమ్మాపూర్‌, హుజూరాబాద్‌, చిగురుమామిడి, వీణవంక, సైదాపూర్‌, గన్నేరువరం, మానకొండూరు, జమ్మికుంట, ఇల్లందకుంట, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్‌ రూరల్‌ తదితర మండలాల్లో సర్వే నంబర్ల వారీగా 87,084 దరఖాస్తులు రాగా 86,732 పరిశీలించారు. 18 వేలకు పైగా తిరస్కరించారు. పట్టాలు జారీ చేసినవి 16,700. దివంగత ఎన్టీఆర్‌ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేతిరాత కాగితాలకు గుర్తింపు లభించగా తిరిగి రెండున్నర దశాబ్దాల అనంతరం సీఎం కేసీఆర్‌ రెండుసార్లు సదవకాశాన్ని కల్పించారు. పంట రుణాలకు నోచుకోక.. కొనుగోలు చేసిన భూమిని అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాత రెవెన్యూ చట్టం రద్దయ్యాక దాని ఆధారంగా చేపట్టే సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులతోపాటు రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో దాదాపు 25 వేలకు పైగా దరఖాస్తులను ఎలాంటి వివాదాలు లేనివిగా అధికారులు గుర్తించారు.

తొలుత ఆర్డీవోలకు బాధ్యతలు..

సాదాబైనామాల అర్జీలకు అవకాశమిచ్చిన తొలిసారి వాటిని క్రమబద్ధీకరించేందుకు సర్కారు తొలుత ఆర్డీవోలను బాధ్యులను చేసింది. కానీ ప్రక్రియ వేగంగా జరగకపోవడంతో వారిని తప్పించి, తహసీల్దార్లకే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. రైతులు ఆన్‌లైన్‌లో ఫామ్‌ 10 ద్వారా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, 13బీ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 1బీలో నమోదు చేసి, అన్నదాతలకు పట్టాదారు పాసుపుస్తకం అందించాలి. విక్రయదారులకు నోటీసులు జారీ చేయడం, వాంగ్మూలం నమోదులో వీరి పాత్ర కీలకం. ఇందుకు బయోమెట్రిక్‌ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడ పొరపాటు జరిగినా తహసీల్దార్లదే బాధ్యత. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ రద్దుతో సాదాబైనామా దరఖాస్తులను గిర్దావర్లే పరిశీలించాలని గతంలోనే నిర్దేశించింది.

25 వేల మందికి పైగా ప్రయోజనం

సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తే జిల్లాలో 25 వేలకు పైగా రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం వారు రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అందుకోలేకపోతున్నారు. ములపై హక్కు పత్రాలుంటే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ముస్లింలకు రంజాన్‌ శుభాకాంక్షలు

- మంత్రి గంగుల కమలాకర్‌

కరీంనగర్‌కల్చరల్‌: నెలరోజులు పవిత్ర రంజాన్‌ మాస ఉపవాస దీక్షలు చేపట్టి శనివారం రంజాన్‌ పండుగ నిర్వహించుకుంటున్న ముస్లింలకు మంత్రి గంగుల కమలాకర్‌ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్‌ మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఈ పండుగ వేళ రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్‌ తోఫాలతో ప్రతి కుటుంబం ఆనందంతో పండగ చేసుకోవాలని కోరారు.

ఉద్యోగి సమ్మెకు దిగితే చట్టరీత్యా నేరం

కొత్తపల్లి: ఎస్మా 1971 యాక్ట్‌లో భాగంగా ఎన్‌పీడీసీఎల్‌ 17 జిల్లాల పరిధిలో అత్యవసర సేవల విభాగం పరిధిలో పనిచేసే ఏ ఉద్యోగి అయినా సమ్మెకు దిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎన్‌పీడీసీఎల్‌ చీఫ్‌ విజిలెన్స్‌ అధికారి బి.జనార్దన్‌ తెలిపారు. విద్యుత్‌సంస్థల్లో సమ్మెలు నిషేధించామన్నారు. యాజమాన్యం సానుకూలంగా ఉన్నప్పటికీ కొందరు సమ్మెకు వెళ్తుండడంతో వరంగల్‌, జనగాం, ఖమ్మం, కరీంనగర్‌ జిల్లాల పరిధిలో కొందరు ఆర్టిజన్‌ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఆర్టీసీలో శిక్షణా తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్‌ఎం ఖుస్రో షా ఖాన్‌

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): కరీంనగర్‌ రీజీయన్‌లోని అన్ని ఆర్టీసీ డిపోలకు చెందిన కండక్టర్లకు ‘నేను నా ఉద్యోగంలో రాణిస్తా’ పేరుతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం రీజనల్‌ మేనేజర్‌ ఖుస్రో షాఖాన్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులను ఆకట్టుకునేందుకు వారితో మర్యాదగా ప్రవర్తించడానికి కండక్టర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. దీంతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని దీనిని పాఠాల రూపంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు భీంరెడ్డి, హరిప్రసాద్‌, విజయ్‌ కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో మెదలాలి

- ఎల్‌. సుబ్బారాయుడు, సీపీ

కరీంనగర్‌క్రైం: ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతతో మెదలాలని కరీంనగర్‌ సీపీ ఎల్‌. సుబ్బారాయుడు అన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో వేసవి తీవ్రత నుంచి ట్రాఫిక్‌ పోలీసులకు ఉపశమనం కలిగించేందుకు కరీంనగర్‌ డెయిరీ యాజమాన్యం ఉచితంగా మజ్జిగ అందించే కార్యక్రమాన్ని సీపీతో కలిసి డెయిరీ చైర్మన్‌ చల్మెడ రాజేశ్వరరావు ప్రారంభించారు. ట్రాఫిక్‌ నియంత్రణకు దోహదపడే 50 స్టాపర్లను డెయిరీ యాజమాన్యం అందించింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌ డెయిరీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీలు తుల శ్రీనివాసరావు, బి.విజయకుమార్‌, ఇన్‌స్పెక్టర్లు తిరుమల్‌, నాగార్జునరావు, కరీంనగర్‌ డెయిరీ మేనేజర్‌ రాజశేఖరరెడ్డి, ట్రాలీ డ్రైవర్లు, యజమానులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగుల ఆందోళనబాట





ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ ప్రతినిధులు

- రెగ్యులరైజ్‌ కోసం దశలవారీగా ఉద్యమాలు
- ఎమ్మెల్యేల నుంచి మంత్రులకు వినతిపత్రాలు
- మంత్రి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిని కలిసిన జేఏసీ ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్‌: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నతీరుపై ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీవోలు, టెక్నికల్‌ అసిస్టెంట్లు, ఈసీ, కంప్యూటర్‌ ఆపరేటర్లు తదితర స్థాయిల్లో మొత్తం 3,874 మంది ఉద్యోగులున్నారు. 2006నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం రెగ్యులరైజ్‌ చేయడం లేదు. దీంతో అప్పట్లో సమ్మెబాట పట్టారు. దీంతో ఫీల్డ్‌ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకున్నప్పటికీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించడంలో జాప్యం చేస్తుండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్‌డీఏ, డ్వామా శాఖలను విలీనం చేసిన ప్రభుత్వం ఉద్యోగులను మాత్రం వేర్వేరుగానే పరిగణిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. సెర్ప్‌ ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేస్తామని, ఏప్రిల్‌ నుంచి పేస్కేల్‌ వర్తింపజేస్తామని ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారన్నారు. సెర్ప్‌ఉద్యోగుల తరహాలోనే తమను కూడా రెగ్యులరైజ్‌ చేయాలంటూ ఉపాధి ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో జేఏసీగా ఏర్పడిన ఉద్యోగులు ఆందోళనలో భాగంగా ముందుగా ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి మంత్రుల వరకు వినతిపత్రాలు సమర్పిస్తూ రెగ్యులరైజ్‌ చేయాలని కోరారు. మూడు నెలలుగా శాంతియుత మార్గంలో వినతిపత్రాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జేఏసీ ప్రతినిధులు హైదరాబాద్‌లో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌, పంచాయతీరాజ్‌ ప్రిన్సిపాల్‌ సెక్రటరీ సందీప్‌కుమార్‌ సుల్తానీయాను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ ప్రతినిధులు అంజిరెడ్డి, నారాయణ, నర్సయ్య, నాగభూషణం, గురుపాదం, కరీంనగర్‌ జిల్లా ప్రతినిధులు శారద, శోభారాణి, సత్యనారాయణ, వెంకటేశ్‌, జగదీశ్‌ పాల్గొన్నారు.

పనులన్నీ ఉపాధిహామీలోనే...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనులన్నీ ఉపాధిహామీ పథకంలోనే అమలవుతున్నాయి. గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, క్రీడా ప్రాంగణాలు, సీసీరోడ్లు, రైతువేదికలు, హరితహారం తదితర కార్యక్రమాలన్ని ఉపాధినిధులతోనే చేపట్టారు. 17ఏళ్ల క్రితం నాలుగైదు వేలతో ప్రారంభమైన ఉద్యోగుల జీతాలు ఇప్పటివరకు రూ.50వేలకు మించలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం కేసీఆర్‌ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేస్తామని చెప్పి కేవలం సెర్ప్‌ ఉద్యోగులను మాత్రమే రెగ్యులరైజ్‌ చేశారని తమని కూడా రెగ్యులరైజ్‌ చేయాలని ఈ సందర్భంగా ఆందోళనబాట పట్టారు.

పే స్కేల్‌ వర్తింపజేయాలి...

సెర్ప్‌ ఉద్యోగుల మాదిరిగానే ఉపాధి ఉద్యోగులకు పేస్కేల్‌ వర్తింపజేయాలి. సెర్ప్‌ ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేసినట్లే, తమని కూడా రెగ్యులరైజ్‌ చేయాలి. గతేడాది అసెంబ్లీ సమావేశాల్లో రెగ్యులరైజ్‌ చేస్తామన్న హామీని సీఎం కేసీఆర్‌ అమలు చేయాలి.

– శారద, కరీంనగర్‌ జిల్లా జేఏసీ చైర్‌పర్సన్‌

బీసీ కులాల ఆత్మగౌరవమే బీఆర్‌ఎస్‌ ధ్యేయం

- వడ్డెర ఆత్మగౌరవ భవన నిర్మాణ ప్రొసీడింగ్స్‌ అందించిన మంత్రి గంగుల
- హైదరాబాద్‌ నడిబొడ్డున వేల కోట్ల విలువైన 87.3 ఎకరాల్లో 41 ఆత్మగౌరవ భవనాల నిర్మాణం



ప్రొసీడింగ్‌ కాపీలు తీసుకుంటున్న వడ్డెర సంఘం నాయకులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్‌: సీఎం కేసీఆర్‌ సంకల్పంతో బీసీ కులాల ఆత్మగౌరవం కోసం వేలకోట్ల విలువైన స్థలాన్ని హైదరాబాద్‌ నడిబొడ్డున కేటాయించామని, కోకాపేట్‌, ఉప్పల్‌లోని 87.3 ఎకరాల్లో 41 వెనుకబడిన కులాలకు సంఘం భవనాలు నిర్మించనున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని తన నివాసంలో వడ్డెర కులసంఘం భవన నిర్మాణానికి ప్రొసీడింగ్స్‌ను సభ్యులకు అందించి మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ కృషితో 19 బీసీ గురుకులాలను 310కి పెంచామని, ఏడాదిలో 112 గురుకులాలను జూనియర్‌ కళాశాలలుగా అప్‌గ్రేడ్‌ చేస్తూ నూతనంగా 33 గురుకులాలు, 15 డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేశామన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్‌ జీవీ. రామకృష్ణారావు, ట్రస్ట్‌ చైర్మన్‌ జంపేటి సత్యనారాయణ రాజు, ఎత్తరి అంతయ్య, ఒరుసు కృష్ణయ్య , అనంతరావు, మక్కల పెంటేశ్‌ , వల్లెపు వెంకట్‌, వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌ దే

- ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలేది ?
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ నగేష్‌



మాట్లాడుతున్న డాక్టర్‌ నగేష్‌

హుజూరాబాద్‌: తొమ్మిదేళ్ల పాలనలో మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్‌ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ నగేష్‌ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. విశాఖ బిడ్డింగ్‌లో సీఎం కేసీఆర్‌ చేతులు ఎత్తేశారని, రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉండగా బిడ్డింగ్‌లో ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. కనీసం రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఉద్యోగుల జీతాలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు రూ.వేల కోట్ల బకాయిలు చెల్లించలేదని, ఎన్నికల వాగ్దానాలు అమలుకు డబ్బులు లేని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కట్టలేని పరిస్థితిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉందన్నారు. సింగరేణిని సీఎం కేసీఆర్‌ దివాలా తీయించాడని ఆరోపించారు. సింగరేణి సంస్థల్లో రాష్ట్రం వాటా 49 ఉంటే కేంద్రానిది 51శాతం ఉందన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలోని వనరులను ఇతర రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ పార్టీకి ఖర్చుపెట్టడం దుర్మార్గమన్నారు.

విద్యార్థులను గణితంలో తీర్చిదిద్దండి

- డీఈఓ జనార్దన్‌ రావు



కోట లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న డీఈవో

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): విద్యార్థులను గణితంలో తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు డీఈవో సీహెచ్‌.జనార్దన్‌రావు పిలుపునిచ్చినారు. స్థానిక సెయింట్‌జాన్స్‌ పాఠశాలలో నిర్వహిస్తున్న పదోతరగతి మూల్యాంకనం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గణిత ఫోరం ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నర్సింహస్వామి, శ్రీనివాసరెడ్డి, మధుసూదనాచారి, మనోహర్‌రెడ్డి, గాజుల రవీందర్‌, అనంతాచార్య, జైపాల్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మే 1 నుంచి టెక్నికల్‌ టీచర్స్‌ సర్టిఫికెట్‌ కోర్సు..

కరీంనగర్‌ మంకమ్మతోట ధన్గర్‌వాడీ పాఠశాలలో మే 1నుంచి జూన్‌ 11 వరకు 42 రోజులు టెక్నికల్‌ టీచర్స్‌ సర్టిఫికెట్‌ కోర్సును నిర్వహిస్తున్నట్లు డీఈవో సీహెచ్‌.జనార్దన్‌రావు తెలిపారు. అడ్మిషన్‌ పొందేవారు. ఏప్రిల్‌ 20, 2023 నాటికి 18 ఏళ్ల నిండి 45 ఏళ్ల లోపువారై ఉండాలన్నారు. ఎస్సెస్సీ లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత ట్రేడ్‌లో లోయర్‌ గ్రేడ్‌ టెక్నికల్‌ సర్టిఫికేట్‌ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి 30లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు పత్రాలు డౌన్‌లోడ్‌ చేసుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ధన్గర్‌వాడీలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

విజేతలకు నగదు బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న వెంకటేశ్వర్లు

తిమ్మాపూర్‌: తపాలా శాఖ ఆధ్వర్యంలో దీన్‌ దయాళ్‌ స్పర్శ్‌ యోజన అంశంపై గతేడాది సెప్టెంబర్‌ 11న నిర్వహించిన లేఖ రాయడం పోటీల్లో ముగ్గురు విద్యార్థులు విజయం సాధించారు. కరీంనగర్‌ డివిజన్‌ పరిధిలోని కరీంనగర్‌, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి 559 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. కరీంనగర్‌ కేంద్రీయ విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్న చిట్టి శ్రావికారెడ్డి, సిరిసిల్ల కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న చిట్టి శివచరణ్‌, కరీంనగర్‌ పారామిత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న మెట్టు గణిత్‌ సాయి టాపర్లుగా నిలిచారు. ఈ మేరకు శుక్రవారం విజేతలకు కరీంనగర్‌ డివిజనల్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ వై.వెంకటేశ్వర్లు అభినందించారు. విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున జమ చేశారు.

బాలికల వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న సివిల్‌ జడ్జి బి.సుజయ్‌

కరీంనగర్‌: భగత్‌నగర్‌లో వెనుకబడిన తరగతుల బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్‌ సివిల్‌ జడ్జి బి.సుజయ్‌, చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ 1098 ప్రాజెక్ట్‌ కో ఆర్డినేటర్‌ సంపత్‌తో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. వసతిగృహంలో వాటర్‌ కూలర్‌ పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో అన్ని సక్రమంగా పనిచేయాలన్నారు. సరైన సమయంలో భోజనం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బి.సుజయ్‌ విద్యార్థులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలుంటే న్యాయ సేవ అధికార సంస్థను కానీ చైల్డ్‌హెల్ప్‌ లైన్‌ 1098ని కానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్‌ వార్డెన్‌ పద్మజ, చైల్డ్‌లైన్‌ 1098 సభ్యుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అస్థికలు కలిపేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదానికి గురై..
- కొత్తపేట వద్ద ప్రైవేట్‌ బస్సు, లారీ ఢీ
- తీవ్రంగా గాయపడి బస్సు డ్రైవర్‌ మృతి
- మరో 15మందికి గాయాలు
- పది మందికి స్వల్పంగా
- అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు
- చెట్టును తప్పించబోయి ఢీకొన్న వాహనాలు



లారీని ఢీకొన్న మినీ ట్రావెల్స్‌ బస్సు



డ్రైవర్‌ పగిల్ల మల్లయ్య(50) మృతదేహం

వెల్గటూర్‌(ధర్మపురి): తన తల్లి అస్థికలను ధర్మపురి గోదావరి నదిలో కలిపేందుకు మినీ బస్సులో బయలు దేరిన మెదక్‌ జిల్లా గజ్వేల్‌ మండలం బేజ్‌గామ్‌ గ్రామానికి చెందిన ఆకుల దేవేందర్‌, తన 25మంది కుటుంబసభ్యులు కొత్తపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో బస్సు డ్రైవర్‌ పగిల్ల మల్లయ్య(50) మృతి చెందగా మిగతా వారు తీవ్రగా గాయపడ్డారు. ఇందులో 15మంది కాళ్లు, చేతులు విరిగాయి. మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆకుల దేవేందర్‌ తల్లి అనసూయ ఇటీవల చనిపోయింది. ఆమె అస్థికలను జిల్లాలోని ధర్మపురి గోదావరినదిలో కలిపేందుకు కుటుంబసభ్యులందరూ శుక్రవారం ఉదయం మినీ బస్సులో బయలుదేరారు. బస్సు ఎండపల్లి మండలం కొత్తపేట వద్దకు రాగానే వెలటూర్‌ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒకేకుటుంబానికి చెందిన ఆకుల మంగమ్మ, మౌనిక, శ్రీనివాస్‌, వెంకటేశం, యాదగిరి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, దినేశ్‌, భాగ్యలక్ష్మి, సుభద్ర, అక్షర, మయాన్షి, మానస, కనకయ్య సహా సుమారు 25 మంది గాయపడ్డారు. 15 మంది కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ పగిల్ల ఎల్లయ్యను జేసీబీ సాయంతో శ్రమించి బయటకు తీశారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడ్డ మిగతావారిని కరీంనగర్‌, జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

చెట్టుకొమ్మను తప్పించబోయి..

వెల్గటూర్‌, ఎండపల్లి మండలాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలలు వీచాయి. వీటిధాటికి చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. సాయంత్రం వరకూ వాటిని ఎవరూ తొలగించలేదు. అయితే, ఈ చెట్టుకొమ్మలను తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్‌ అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రెండు బైకులు ఢీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం రెండు బైకులు ఢీకొని చెన్నబోయిన వెంకటేశ్‌కు తీవ్ర గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. కేశవపట్నం గ్రామానికి చెందిన చెన్నబోయిన వెంకటేశ్‌ బైక్‌పై మేన్‌రోడ్డుకు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీ కొట్టి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్‌ను ఈఎమ్‌టీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి 108లో కరీంనగర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాధారణంగా అందరూ కాఫీ లేదా గరం గరం చాయ్‌తో రోజును ప్రారంభిస్తారు. అందులో కొత్తేమీ లేదు. బండిలో పెట్రోలు పోయకపోతే బండి ముందుకు కదలనని మొరాయించినట్లే ఇది కూడా! అయితే ఇది వేసవి కాబట్టి అలా కాఫీ, టీ లకు బదులుగా పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఒక గ్లాసు ఆరోగ్యకరమైన పానీయం తాగటం చాలా మంచిదని అంటున్నారు నిపుణులు. కావాలంటే ఓ అరగంట గ్యాప్ ఇచ్చి, యథావిధిగా కాఫీనో, టీనో తాగచ్చు. అలా తాగడం ద్వారా ఉదయం పూట రిఫ్రెషింగ్ గా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. అలాంటి గుడ్ మార్నింగ్ డ్రింక్స్ కొన్నింటిని చూద్దాం.



మార్నింగ్ డ్రింక్‌తో రోజంతా హుషారుగా

తేనె- దాల్చిన చెక్క పానీయం



ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడిని వేసి తాగాలి. ఇది మిమ్మల్ని రిఫ్రెష్ చేస్తుంది. కడుపును శుభ్రం చేస్తుంది.

నిమ్మరసం



ఒక గ్లాసు నిమ్మరసం సహజంగా శరీరంలో టాక్సిన్స్ ఏమీ లేకుండా చేస్తుంది. ఇది ఉదయం వేళ టీ లేదా కాఫీకి కూడా మంచి ప్రత్యామ్నాయం. గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగాలి, రుచి కోసం కొంచెం తేనెను కూడా కలపవచ్చు.

దాల్చిన చెక్క గ్రీన్ టీ



గ్రీన్ టీ తాగితే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ, కడుపు సమస్యలను నివారించడానికి, మీరు శుభోదయ పానీయంగా కప్పు గ్రీన్ టీ తాగవచ్చు. గ్రీన్ టీ రుచి ఇష్టం లేకపోతే అందులో ఒక చిటికెడు దాల్చిన చెక్క పొడి, తేనె కలిపితే సరి. ఆ పానీయాన్ని ఆస్వాదించవచ్చు.

కొబ్బరి నీరు



కొబ్బరి నీరు చాలా ఆరోగ్యకరమైన పానీయం. అప్పుడప్పుడూ ఉదయం పూట కొబ్బరి నీరు తాగుతుంటే మీకు మార్నింగ్ ఎనర్జీ డ్రింక్‌గా మాత్రమే కాదు, మీ శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేసే రుచికరమైన పానీయం. సాదా కొబ్బరి నీరు తాగండి, ఇందులో ఏమీ కలపాల్సిన అవసరం లేదు.

అలోవెరా జ్యూస్



చాలారకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులు కలబంద ఆధారితమైనవే ఉంటాయి. ఉదయం పూట కలబంద జ్యూస్ తాగటం ఎంతో ఉత్తమం. ఈ పానీయం ఉదయాన్నే తాగిన తరువాత, మీ శరీరం తక్షణమే చైతన్యం అవుతుంది. మీరు మీ రోజును ప్రారంభించడానికి తగిన తక్షణ శక్తి వస్తుంది. అంతేకాదు, చర్మసమస్యలు అన్నీ పోయి, మెరిసే చర్మం వస్తుంది.

దోసకాయ... పుదీనా జ్యూస్

దోసకాయ పుదీనా నీరు జ్యూస్ డిటాక్సింగ్ డ్రింక్. మీ శరీరం నుంచి మలినాలను, విషపదార్థాలను తొలగిస్తుంది. ఉదయం పూట మిమ్మల్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. మీ ఆరోగ్యకరమైన ఉదయం దినచర్యకు ఇది మంచి డ్రింక్. ముఖ్యంగా వేసవిలో పుదీనాతో కలిసిన దోసకాయ డ్రింక్ మీ శరీరాన్ని చల్లబరుస్తుంది.

రోజ్ షర్బత్

ముందుగా సబ్జా గింజలను నీటిలో నానబెట్టండి, ఈ లోపు రోజ్ సిరప్ సిద్ధం చేసుకోండి. ఒక గుప్పెడు తాజా గులాబీ పువ్వు రెమ్మలను తీసుకొని ఒక గిన్నె నీటిలో ఉడికించండి. మరొక గిన్నెలో చక్కెర, నీరు కలిపి చక్కెర పాకం తయారు చేయండి. చక్కెర పాకంలో ఉడికించిన గులాబీ నీరు ఫిల్టర్ చేసుకొని బాగా కలిపేస్తే రోజ్ సిరప్ రెడీ. ఇప్పుడు మెత్తగా నానబెట్టిన సబ్జా గింజలను వడకట్టి ఒక గ్లాసులోకి తీసుకోండి.అందులో రోజ్ సిరప్, ఐస్ క్యూబ్స్, కోల్డ్ వాటర్ వేసి కలపండి, పై నుంచి నిమ్మరసం పిండుకోండి. అంతే, రోజ్ షర్బత్ రెడీ.



వేసవి అంతా రోజూ ఉదయం పూట ఇలాంటి ఏదైనా ఒక పానీయం తాగటం ద్వారా మీరు రోజంతా చురుకుగా, హుషారుగా ఉంటారు.

మీకు తెలుసా?

మొలకెత్తిన బంగాళదుంపలు తింటే మన ఆరోగ్యానికే పెను ముప్పు తెచ్చిపెడతాయి. బంగాళదుంపలపై వచ్చే మొలకలు విషపూరితమైనవని చెబుతున్నారు నిపుణులు. ఒక్కోసారి ఫుడ్ పాయిజన్‌కి దారి తీసి ప్రాణాల మీదకు కూడా తెస్తుంది. బంగాళదుంపలపై ఏర్పడే మొలకల్లో గ్లైకో అల్కాయిడ్స్ అనే విషపూరితమైన రసాయన పదార్థాలు ఉంటాయి. మొలకెత్తిన బంగాళదుంపల్లో అధిక స్థాయిలో ఈ రసాయన పదార్థం ఉంటుంది. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇవి తిన్న కొద్ది గంటలలోనే వాంతులు, విరోచనాలు, పొత్తి కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా లో బీపీ, పల్స్ ఎక్కువగా కొట్టుకోవడం, జ్వరం, తల నొప్పి, మతిమరుపు.. కడుపులో నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన ఆలుగడ్డలను గర్భిణీలు తింటే పుట్టబోయే బిడ్డపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. బంగాళదుంపలను చల్లని, చీకటి ప్రదేశాల్లో నిల్వ ఉంచడం ద్వారా అవి మొలకెత్తడాన్ని నివారించవచ్చు.



ఎండలో కంటికి అండగా...



వేసవి కాలంలో చర్మానికి సంబంధించిన సమస్యలే కాదు, కళ్లకు సంబంధించిన సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తాయి. ఎండవేడిమికి గురికావడం వల్ల కళ్లు పొడిబారడం లేదా మంటలు పుట్టడం, ఎర్రబారడం వంటి సమస్యలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడంతోపాటు కొన్ని రకాల ఆహార పానీయాలు తీసుకోవడం మంచిది. అవేమిటో చూద్దాం.

కంటి ఆరోగ్యాన్ని కాపాడే వాటిలో నిమ్మరసం కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎండలనుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాకుండా, కళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పనిని కూడా చేస్తుంది.

ఎందుకంటే, నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కళ్ళను రక్షిస్తుంది. అంతే కాదు, నిమ్మకాయలో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది దృష్టిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మరసంలో ఉండే లుటిన్, జియాక్సంతిన్ అనే ముఖ్యమైన పోషకాలు మాక్యులర్ డీ జనరేషన్, కంటిశుక్లం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. నిమ్మకాయలో ఉండే విటమిన్ సి కళ్ల రక్తనాళాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇది రెటీనాకు రక్త ప్రసరణ జరిగేలా చూస్తుంది. తద్వారా కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఇంకా పుచ్చకాయ, కర్బూజ, మామిడి, బొప్పాయి పండ్లు తినడం, కొబ్బరినీళ్లు తాగడం, ఆహారంలో ఉల్లిపాయలను బాగా ఉపయోగించడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

కళ్లు మంటలు ఉన్నప్పుడు కాసిని మల్లెపూలను ఒక గ్లాసు నీళ్లలో వేసి అరగంట తర్వాత ఆ నీటితో కళ్లను కడుక్కుంటే ఉపశమనం కలుగుతుంది. అలాగే, చక్రాలుగా తరిగిన కీరాముక్కలను లేదా బంగాళదుంప ముక్కలను కళ్ల మీద ఉంచుకోవడం కూడా ప్రయోజనకరం. కొంతమందికి రాత్రిపూట కళ్లు కనిపించవు. ఈ వ్యాధిని రేచీకటి అంటారు. ఆహారంలో విటమిన్ ఎ ఆధారిత ఆహారాన్ని తక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. దీనిని నివారించాలంటే పాలకూర, బొప్పాయి, క్యారెట్ ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరల్లో తోటకూర, పొన్నగంటి కూర కంటికి చాలా మంచిది.

ఈ కాలంలో వీచే వడగాలులు చాలా ప్రమాదకరం. వేడిమికి కళ్లల్లో ఉండే తేమ ఆవిరైపోతుంది. ఫలితంగా కంటి వద్ద చర్మం పొడిబారి, కళ్లల్లో ఇసుక వేసినట్లుగా ఉంటుంది. గాలులకు దుమ్ము, ధూళి కంట్లో పడడం వల్ల కళ్ల దురద, మంటలు వస్తాయి. అందువల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సన్ గ్లాసులు పెట్టుకోవాలి. ఇంటికి చేరిన వెంటనే చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి.

హెల్త్ టిప్స్



అల్లం అంగుళం ముక్క, బెల్లం చిన్న ముక్క తీసుకుని రెండూ కలిపి రాత్రి పడుకోబోయేముందు నమిలి తింటే మలబద్ధకం పోతుంది.



మెంతికూర చిన్నదిగాని, పెద్దదిగాని కూర చేసుకుని రోజూ కనీసం మూడు నెలలు తింటే రక్తహీనత తగ్గుతుంది.



వేపనూనె, కర్పూరం కలిపి రాస్తే తలలోని కురుపులు మాడిపోతాయి, చుండ్రు తగ్గుతుంది.

మొదటి విమాన ప్రయాణమా?



మొదటిసారి విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు చాలా ఆసక్తిగా ఉంటుంది. విమాన ప్రయాణం చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో అలర్ట్‌గా ఉండాలి. ఏమీ తినకుండా లేదా ఫుల్లుగా తిని విమాన ప్రయాణం చేయకూడదు. ముఖ్యంగా కొన్ని ఆహారపదార్థాలకి దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం...

విమానంలో ప్రయాణించే ముందు బిర్యానీ, ఊరగాయలు వంటి ఆయిల్, స్పైసీ ఫుడ్ తింటే కడుపు నొప్పి వస్తుంది. గుండె మంట, మూత్రాశయం చికాకు సమస్యలు వస్తాయి. ఇవిఅధిక కేలరీలను కలిగి ఉండటంతోబాటు వీటి మూలాన నోటి నుంచి వాసన వస్తుంది. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌లో కంటికి ఇంపుగా నోరూరిస్తూ కనిపించే రకరకాల ప్యాకేజ్డ్ ఫుడ్ తీసుకోవడం అసలు మంచిది కాదు. ప్రయాణించే ముందు బర్గర్ లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల అరుగుదల సరిగా లేక గుండెల్లో మంట వస్తుంది. అలాగే ఆపిల్ తినడమూ అంత మంచిది కాదు. ఎసిడిటీ లేదా గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. యాపిల్స్‌లో చక్కెర అధికంగా ఉండటం వల్ల అది పేగు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే బొప్పాయి లేదా నారింజ పండ్లను తినవచ్చు. చాలామంది ఫ్లైట్ ఎక్కే ముందు ఏదో ఒక రకమైన స్నాక్స్ తింటారు. అయితే ఆరోగ్యనిపుణుల అభిప్రాయం ప్రకారం స్నాక్స్ అజీర్ణం, వికారం లేదా ఉబ్బరం కలిగిస్తాయి. అలాగే విమాన ప్రయాణానికి ముందు బ్రోకలీతో చేసిన ఆహారాలు కూడా తినకూడదని గుర్తుంచుకోండి.

సినిమా

ఆటకు వేళాయె అంటూ కొందరు స్టార్స్ ప్లేయర్స్‌గా మారారు. క్రికెటర్లుగా, కోచ్‌లుగా మౌల్డ్ అయిపోయారు. అయితే ఈ ఆట అంతా సినిమాల కోసమే. ప్రస్తుతం క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. కొన్ని కాల్పనిక కథలు కాగా, కొన్ని బయోపిక్స్ కూడా ఉన్నాయి. ఇక వెండితెరపై క్రికెటర్లుగా అలరించనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

ఆటకు వేళాయె



రజనీకాంత్


● సూపర్ స్టార్ రజనీకాంత్ ఓ క్రికెట్ మ్యాచ్ నిర్వహణ మీద ఉన్నారు. 'లాల్ సలామ్' చిత్రం కోసమే ఇదంతా. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణువిశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్‌లో, రజనీకాంత్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ క్రికెట్ కోచ్ పాత్రలో కనిపిస్తారనీ, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధిగా కనిపిస్తారనీ ప్రచారం జరుగుతోంది. మరి.. రజనీ ఏ పాత్రలో కనిపిస్తారో చూడాలి. 'లాల్ సలామ్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.



సిద్ధార్థ్



నయనతార



మాధవన్

● క్రికెట్ గ్రౌండ్‌లో బిజీగా ఉంటున్నారు మాధవన్, సిద్ధార్థ్, నయనతార. ఈ ముగ్గురూ కలిసి సిల్వర్ స్క్రీన్‌పై ఆడనున్న మ్యాచ్ 'ది టెస్ట్'. తమిళ నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో నయనతార, మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

● శ్రీలంక మాజీ క్రికెటర్, స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ '800' టైటిల్‌తో తెరకెక్కుతోంది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంలో సలీమ్ మాలిక్ పాత్ర చేసిన మధుర్ మిట్టల్ ఈ చిత్రంలో మురళీధరన్ పాత్ర చేస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. ''మురళీధరన్ జీవితంలోని పలు కోణాలను ఈ చిత్రంతో వెండితెరపై ఆవిష్కరించనున్నాం. 800 వికెట్లు తీసిన ఏకైక ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మురళీధరన్ పేరిట రికార్డు ఉంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



మధుర్ మిట్టల్

● భారత ప్రముఖ మాజీ క్రికెటర్ జులన్ గోస్వామి జీవితం ఆధారంగా రూపొందిన వెబ్ మూవీ 'చక్దా ఎక్స్‌ప్రెస్'. ఇందులో జులన్ గోస్వామిగా అనుష్కా శర్మ నటించారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. పశ్చిమ బెంగాల్ చక్దా ప్రాంతానికి చెందిన జులన్ గోస్వామి దాదాపు రెండు దశాబ్దాలు మహిళా క్రికెటర్‌గా, కెప్టెన్‌గా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను లీడ్ చేశారు. ఉమెన్స్ వన్ డే ఇంటర్‌నేషనల్ క్రికెట్ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జులన్ రికార్డు సాధించారు.



అనుష్కా శర్మ



జాన్వీ కపూర్

● యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ సైతం క్రికెట్ బ్యాట్ పట్టారు. 'మిస్టర్ అండ్ మిస్సెస్ మహి' సినిమాలో జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటిస్తున్నారు. రాజ్‌కుమార్ రావ్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. రియల్ క్రికెటర్స్ దగ్గర శిక్షణ తీసుకుని జాన్వీ కపూర్ ఈ సినిమా చేశారు. వీరితోపాటు మరికొందరు క్రికెటర్ల బయోపిక్‌లు, క్రికెట్ ఆధారంగా సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.

టైమ్‌లెస్ లవ్!

హీరో నాగచైతన్య–డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందుతున్న తెలుగు–తమిళ చిత్రం 'కస్టడీ'. కృతీ శెట్టి కథానాయిక. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా మే 12న రిలీజ్ కానుంది. ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్‌శంకర్ రాజా స్వరపరచిన ఈ చిత్రంలోని 'టైమ్‌లెస్ లవ్..' అంటూ సాగే పాటని రేపు (ఆదివారం) రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో 'కస్టడీ' తెరకెక్కుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: పవన్ కుమార్, కెమెరా: ఎస్ఆర్ కదిర్.



నాగచైతన్య, కృతీ శెట్టి

వీళ్లందరూ మిస్ అవలేదు..




'అల్లరి' నరేశ్

'నిన్న రాత్రి నుంచి మా నాన్న కనిపించడం లేదు సార్', 'రెండు వారాల నుంచి మా అబ్బాయి కనిపించడం లేదు సార్' అనే డైలాగులతో 'ఉగ్రం' సినిమా ట్రైలర్ విడుదలైంది. 'నాంది' వంటి హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఉగ్రం'. మిర్నా మీనన్ కథానాయికగా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదల చేశారు. 'వీళ్లందరూ మిస్ అవలేదు.. మిస్ చేయబడ్డారు. అందులో నా భార్య, కూతురు కూడా ఉన్నారు ('అల్లరి' నరేశ్), 'చీకట్లో జరిగే వ్యాపారం.. చీకట్లోనే వదిలెయ్. (విలన్ పాత్రధారి)' వంటి డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఉగ్రం'. నరేశ్ పాత్రను విజయ్ కనకమేడల ఇంటెన్స్‌గా చూపించారు. 'నాంది'లా 'ఉగ్రం' కూడా మంచి హిట్ అవుతుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సిద్, సంగీతం: శ్రీచరణ్ పాకాల.


వినోదాత్మకంగా...

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్లమాన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్పాల దర్శకత్వంలో డా. బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నేత అద్దంకి దయాకర్ కీలక పాత్రలు పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. బత్తిని కీర్తిలత మాట్లాడుతూ– ''ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ మధ్య ప్రివ్యూ షో చూసిన సినీ, రాజకీయ ప్రముఖులు బాగుందని అభినందించారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్రంలోని 'ఎల్లమ్మ..' పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. మంచి కథను కామెడీగా చెప్పడంతో ప్రేక్షకులకు మా సినిమా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



సుధాకర్ రెడ్డి

వాస్తవ ఘటన ఆధారంగా....




రాజీవ్ కనకాల

అనిరుధ్, యశస్విని జంటగా, రాజీవ్ కనకాల, జీవా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది. భిక్షపతి రాజు మాట్లాడుతూ– ''వాస్తవ ఘటన స్ఫూర్తితో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని పాత్రలన్నీ సహజంగా ఉంటాయి. సీనియర్ నటులు జీవా, రాజీవ్ కనకాల నటన హైలైట్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు.

డాక్టర్ రేణు

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో డాక్టర్ రేణు పాత్రలో హీరోయిన్ రుహానీ శర్మ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. 'చిలసౌ, హిట్: ది ఫస్ట్ కేస్, డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు రుహానీ శర్మ. 'శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'హిట్: ది ఫస్ట్ కేస్'లో హీరోయిన్‌గా నటించారు రుహానీ. ఇప్పుడు మరోసారి ఆయన దర్శకత్వంలో 'సైంధవ్'లో డాక్టర్ రేణుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీని ఈ చిత్రంతో తెలుగుకి పరిచయం చేస్తున్నాం. ప్రస్తుతం 'సైంధవ్' షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్.



రుహానీ శర్మ

చూపు తిప్పిందేంటి?

'తెలుగు ఇండస్ట్రీ కన్నడపై చూపు తిప్పిందేంటి?' అనే డైలాగ్‌తో 'మళ్ళీ పెళ్లి' సినిమా టీజర్ విడుదలైంది. వీకే నరేష్, పవిత్రా లోకేష్ జోడీగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎంఎస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేష్ నిర్మిస్తున్నారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మధువే' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'అతను భార్యని ఎలా చూసుకోవాలో, భార్య విలువేంటి? అని తెలియని ఒక మృగం' (వనితా విజయ్ కుమార్), 'చుట్టూ అప్పులు, ఒంటినిండా రోగాలు పెట్టుకున్న నీతో సరసం ఏంటే?' (వీకే నరేశ్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''ఆసక్తికరమైన కథలను ఎంచుకుంటున్న ఎంఎస్ రాజు మరో విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ వేసవిలో తెలుగు, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. జయసుధ, శరత్ బాబు, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.



పవిత్ర, నరేశ్